

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: జేసీ

పార్వతీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శోభిక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. వాహనాల వేగం తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలకు హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు తప్పనిసరిగా బిగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జునరెడ్డి, ఏఎస్పీ సునీల్‌శ్రవణ్, డీపీవో బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలు బంద్?





- 18 నుంచి నిలిపివేయాలని నిర్ణయం
- ప్రకటించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- జిల్లాలో రూ.1.63 కోట్ల బిల్లుల పెండింగ్
- ఆందోళనలో పేద, మధ్యతరగతి ప్రజలు

ఎన్నికల వేళ సిద్ధం అంటూ సభల కోసం రూ.కోట్లు వెచ్చిస్తున్న సీఎం జగన్ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు మాత్రం బకాయిలు చెల్లించడం లేదు. దీంతో ఈ ఆస్పత్రులకు రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఈ నెల 18 నుంచి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేసేందుకు ఆస్పత్రుల యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. ఈ నిర్ణయంతో ఆరోగ్య శ్రీ కింద చికిత్స పొందాలనుకున్న రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ నెల 18 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. పెండింగ్ బిల్లులు భారీగా పెరగడం, వివిధ వైద్య ప్యాకేజీల ధరలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం, రోగులకు అందించిన చికిత్సలకు తగ్గట్టు ఫీజుల చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో ఆరోగ్య శ్రీ సేవలను ఆపివేయాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో మూడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయి. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు సాలూరు, పాలకొండ పట్టణాల్లోని ఒక్కొక్క ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులు ఆరోగ్య శ్రీ సేవలు పొందుతున్నారు. ఈ ఆస్పత్రులకు సుమారు రూ.1.62కోట్ల పైబడి బిల్లులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. దీంతో ఎప్పటి కప్పుడు నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను ఆపేస్తున్నాయి. గతేడాది మేలో ఇదే విధంగా సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించగా ప్రభుత్వం హడావుడిగా ఆ నెలకు సంబంధించి కొంత బకాయిలు విడుదల చేసింది. మళ్లీ డిసెంబరులో చెల్లింపులు మందగించాయి. దీంతో అదే నెల 29 నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. అయితే ప్రభుత్వం చర్చలు జరపడంతో వెనక్కి తగ్గాయి. ఆ తరువాత బిల్లుల చెల్లింపులో పురోగతిలేకపోవడంతో ఈ నెల 18 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేసేందుకు సిద్ధవుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన నెలకొంది.

ఆస్పత్రుల్లో అందని సేవలు..

ప్రభుత్వం 3,255 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చింది. అయితే ఇందులో రెగ్యులర్ రుగ్మతలకు సంబంధించి మాత్రం ఆపరేషన్లు, వైద్యసేవలను చేర్చలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పరిధిలో వైద్యసేవల కోసం రోగి చేరిన నాటి నుంచి ఆపరేషన్ తరువాత వసతి, భోజనం, మందులు అందించాల్సి ఉంటుంది. దాదాపు ఆరు నెలల వరకూ వారికి మందులు అందించాలి. కానీ, ఇదెక్కడ అమలవుతున్న దాఖలాలు లేవు. ఒక్కో ఆరోగ్యశ్రీ కార్డుకు రూ. 25 లక్షల వరకూ వెసులబాటు ఉంటుంది. రోగికి వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, మందులు, భోజనం, వసతి ఇవన్నీ లెక్క కట్టి ఆ మొత్తంలో తీసుకుంటారు. అయితే కొన్ని ఆస్పత్రులు ఖర్చుకు మించి ఆరోగ్యశ్రీలో జమ చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. మరోపక్క ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర వైద్యసేవల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న వారికి అక్కడ చుక్కెదురవుతోంది. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి రూ.25లక్షల సాయం అందుతుంద ని చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆస్పత్రులు రకరకాలుగా కొర్రీలు పెడుతున్నాయి. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లు చెబుతున్న దానికి, అక్కడ ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నదానికి పొంతన ఉండడం లేదు. ప్రధానంగా నిరక్షరాస్యులు, పెద్దగా అవగాహన లేనివారు వెళ్తుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ కంటే సాధారణ వైద్యానికే మొగ్గుచూపుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం బిల్లులు పెండింగ్ పెడుతుండడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సాధారణ వైద్యానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

బిల్లులు చెల్లిస్తున్నాం..

ఆరోగ్య శ్రీ పథకం ద్వారా సేవలు అందించిన ప్రైవేటు ఆస్పత్రులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నాం. బకాయిలు ఉంటే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని మూడు ఆస్పత్రులకు రూ.1.62కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

-అప్పారావు, జిల్లా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం అధికారి



బాధగా ఉంది..

మా ఆస్పత్రిలో గత రెండేళ్లుగా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు సేవలు అందిస్తున్నాం. 2022 జూలై నుంచి ఇప్పటి వరకు ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు 900, గైనిక్ 100, జనరల్ ఆపరేషన్లు 300 వరకు చేశాం. కానీ, ప్రభుత్వం నుంచి మాకు డబ్బులు రాలేదు. బిల్లుల చెల్లింపులో తాత్సారం చేయడం బాధగా ఉంది. త్వరితగతిన బిల్లులు చెల్లిస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అవకాశం ఉంది.

-డాక్టర్ పీబీపీఆర్ నాయుడు(నాని), సౌజన్య ఆసుపత్రి నిర్వాహకులు, పార్వతీపురం

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- 'ఉపాధి' ఉద్యోగులకు అమలు కానీ పీఆర్‌సీ
- నిలిచిన రెగ్యులర్ ప్రమోషన్లు
- భవిష్యత్‌కు భద్రత లేకపోవడంతో ఆందోళన



పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి ఉద్యోగులు (ఫైల్)

జియ్యమ్మవలస: జిల్లాలోని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నారు. పీఆర్‌సీ అమలు కాక, జీతాలు పెరగక ఇబ్బందులు పడుతున్నారు. అలవెన్స్‌లు, గ్రాట్యూటీ కానరావడం లేదు. ఏళ్లుగా రెగ్యులర్ ప్రమోషన్లకు నోచుకోవడం లేదు. తమ భవిష్యత్‌కు భద్రత లేకుండాపోతుందని ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు, సీతంపేట క్లస్టర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 15 మండలాల్లో 17 మంది ఏపీవోలు, ముగ్గురు ఏపీడీవోలు, 13 మంది జేఈలు, ఇద్దరు ఈసీలు పనిచేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఉపాధి వేతనదారులకు పనులు కల్పిస్తున్నారు. అయితే ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే, ఎన్నికల వేళ తమ సమస్యలు పరిష్కారమవుతాయా, లేక కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత న్యాయం జరుగుతుందా? అని ఎదురుచూస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

● ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేసిన ప్రతీసారి ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు కూడా తదనుగుణంగా జీతాలు పెరిగేవి. కానీ, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మిగిలిన ఉద్యోగులకు రెండుసార్లు 23 శాతం పీఆర్‌సీ అమలు చేసి ఉపాధి ఉద్యోగులను విస్మరించింది. తమకూ 23 శాతం పీఆర్‌సీ అమలు చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ● అలవెన్స్‌లను బేసిక్ పేలో కలపకుండా విడిగా రివైజ్డ్ వేజ్ అలవెన్స్ (ఆర్‌డబ్ల్యూఏ), ఎంప్లాయి వేజ్ అలవెన్స్ (ఈడబ్ల్యూఏ), అడిషనల్ వేజ్ అలవెన్స్ (ఏడబ్ల్యూఏ) రూపంలో చూపుతున్నారు. వీటిని నేరుగా కాకుండా అలవెన్స్‌లో కలిపి జీతం చూపించాలి. ● 60 ఏళ్లు దాటి పదవీ విరమణ చేసిన 56 మంది ఉపాధి ఉద్యోగులు రిక్త హస్తాలతో ఇంటికి వెళ్తూ మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. భవిష్యత్‌కు భద్రత లేకుండా, పిల్లల ఆదరాభిమానులు ఉంటాయో లేదో తెలియక శూన్యం వైపు చూస్తూ కాలం గడుపుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ● ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అర్హులైన ఉపాధి ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దాన్ని అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ● 2011-12 ఆర్థిక సంవత్సరంలో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో విద్యార్హత, అనుభవం ఉన్న టెక్నికల్ అసిస్టెంట్లను ఈసీలుగా, జేఈలుగా ప్రమోషన్లు కల్పించారు. ఆ తరువాత రెగ్యులర్ ప్రమోషన్లు పూర్తిగా ఆపేశారు. వెంటనే రెగ్యులర్ ప్రమోషన్లు చేపట్టాలి.

అన్యాయం జరిగింది..



ఉపాధి ఉద్యోగులుగా పనిచేస్తున్న మాకు ఈ ప్రభుత్వంలో అన్యాయమే జరిగింది. ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదు. జీతాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలి.

-కె.శ్రీనివాసరావు, ఏపీవో, జిల్లా అధ్యక్షుడు, గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం

సమస్యలు పరిష్కరించాలి..



దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అరకొర జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. పీఆర్‌సీ అమలు చేసి జీతాలు పెంచాలి. గ్రాట్యూటీ సైతం అమలు చేయాలి. లేదంటే మా కుటుంబాలు అన్యాయమైపోతాయి.

-దాసరి తేజేశ్వరరావు, జేఈ, జియ్యమ్మవలస మండలం



పట్టాలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు

పెత్తందారుల చేతికి గిరిజనుల భూములు

- సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిపుత్రులు
- న్యాయం చేయాలని డిమాండ్

పార్వతీపురం రూరల్, మార్చి 13: మండలంలోని వెలగవలస పంచాయతీ ములగవలస, ములగ పంచాయతీ తదితర గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న భూములను పెద్దదారులకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. తాము సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని కోరుతుంటే పట్టించుకోకుండా సర్వేలు నిర్వహించి పెత్తందారులకు అప్పగించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రయత్నిస్తుందని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ములగవలస, ములగ తదితర గ్రామాల్లో కొంతమంది డీ పట్టా భూములు సాగుచేస్తూ హక్కులు పొందారు. ఆ తర్వాత వాటిని ఇతరులకు విక్రయించేశారు. భూములు కొనుగోలు చేసుకున్న వారు వాటిని ఖాళీగా విడిచిపెట్టేశారు. దీంతో దశాబ్దాలుగా ఆ భూములను కొందరు గిరిజనులు సాగుచేస్తున్నారు. మరికొందరు ఆ స్థలాల్లో ఇళ్లు సైతం కట్టుకున్నారు. అయితే, డీ పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్నారని చెప్పి ములగవలస గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు స్థానిక వైసీపీకి చెందిన కీలక నేత ప్రయత్నాలు చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ నేతకు రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాగు చేస్తున్న భూములకు శాశ్వత హక్కులు కల్పించాలని, 1993లో ఇచ్చిన పట్టాలకు పోడు భూములు కాకుండా సాగుభూమి ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవంగా గతంలో పట్టాలు పొందిన వారు సాగు చేయకుండా ఇతరులకు భూములను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వీటిని కొనుగోలు చేసిన వారు వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన కొత్త ఆదేశాల ప్రకారం పట్టాలు పొందిన వారి పేరిట హక్కులు కల్పించుకొని తిరిగి వారికి ఎటువంటి సొమ్ము ఇవ్వకుండానే ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం అధికారికంగా వారి భూములను రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగానే గతంలో క్రయ విక్రయాలు జరిగిన భూములను ప్రస్తుతం సర్వే చేస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. గతంలో తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసుకున్న పెత్తందారులు ప్రస్తుతం ఆ భూములను అధికారికంగా సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు 150 ఎకరాల్లో ఈ పరిస్థితి ఉంది.



గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నిబంధనల ప్రకారం సర్వే నిర్వహిస్తున్నాం..

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గిరిజన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నాం. రెవెన్యూ రికార్డులు ప్రకారం పట్టాలు పొందిన వారు ప్రస్తుత ఆ భూములను సాగు చేస్తున్నారో లేదో సర్వే ద్వారా తెలుసుకుంటాం. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం.

-హేమలత, ఆర్డీవో, పార్వతీపురం

పోరాటం చేస్తాం..

గిరిజనులకు అన్యాయం చేస్తూ పెత్తందారులకు అండగా రెవెన్యూశాఖ పనిచేస్తుంది. గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయమని అడిగితే పట్టించుకోవడం లేదు. ఇప్పుడు గిరిజనులకు అన్యాయం చేసే విధంగా సర్వేలు నిర్వహిస్తున్నారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

-రాము, గిరిజన సంఘం ప్రతినిధి, వెలగవలస పంచాయతీ, పార్వతీపురం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ శోభిక తదితరులు

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు

పార్వతీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం ఆయన జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ ఫారాలను పరిష్కరించడంతో పాటు ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ పీవోలు కల్పనాకుమారి, సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పాలకొండ, పార్వతీపురం ఆర్డీవోలు పాల్గొన్నారు.

నామినేషన్ల చివరి రోజు వరకూ ఓటరుగా నమోదు కావచ్చు..

ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల చివరి రోజు వరకూ ఓటరుగా నమోదు కావడానికి ఫారం-6 సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. 769 లోకేషన్లలో 1031 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 26 పోలింగ్ స్టేషన్ల లోకేషన్లు, 244 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పునకు ఎన్నికల కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

ఐదేళ్లుగా ఎన్నికలు లేవు

- జీసీసీకి కరువైన పాలకవర్గం
- ముగిసిన ప్రత్యేకాధికారి పాలన
- కొత్త పనులు చేపట్టేందుకు ఇబ్బందులు



సీతంపేటలో నిర్వహిస్తున్న జీసీసీ డివిజనల్ కార్యాలయం

సీతంపేట, మార్చి 13: స్థానిక గిరిజన సహకార సంస్థ ఎన్నికలను గత ఐదేళ్లుగా నిర్వహించడం లేదు. దీంతో జీసీసీ ప్రత్యేక అధికారిగా డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారికి బాధ్యతలను జిల్లా కో-ఆపరేటివ్ అప్పగించింది. ప్రత్యేక అధికారి కాలపరిమితి కూడా గతనెల 8వ తేదీతో ముగిసింది. దీంతో సొసైటీకి అవసరమైన సభ్యులు, స్పెషల్‌అధికారి లేకపోవడంతో జీసీసీ చేపట్టే వ్యాపారాలకు సంబంధించి సొంత నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి సీతంపేట సొసైటీ పరిధిలో 756 మంది గిరిజన సన్న, చిన్నకారు రైతులు సభ్యత్వాన్ని తీసుకున్నారు. వీరిలో ఐదుగురు సభ్యులను అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, డైరెక్టర్లుగా ఎన్నికల ద్వారా నియామకం చేపడతారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సొసైటీ సమావేశం ఏర్పాటు చేయాలి. సొసైటీలో తీర్మానం చేసిన అంశాలను ఆమోదం కోసం మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలి. అక్కడ ఆమోదం పొందిన తర్వాత సొసైటీకి అవసరమైన కార్యకలాపాలు నిర్వహించానికి వీలు కలుగుతుంది. ఈ ఎన్నికలు రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా కో-ఆపరేటివ్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గత ఐదేళ్లుగా సొసైటీ ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో సొసైటీలో నిర్వహించాల్సిన వివిధ వ్యాపారాలు, లావాదేవీలు, నిర్వహణ, తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ప్రతి ఐదేళ్లకు ఒకసారి సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి. కాలపరిమితి పూర్తయిన తర్వాత రెన్యూవల్ చేయడంగాని, ఎన్నికలు నిర్వహించడం గాని చేపట్టాల్సి ఉంది. కానీ అధికారులు దృష్టిసారించకపోవడంతో సొసైటీ ఎన్నికలు జరగక, కొత్త బాడీ నియామకం జరగక పనులకు ఆస్కారం ఉండడం లేదు. అదే సొసైటీ పాలకవర్గం ఉంటే కొత్త డీఆర్ డిపోల ఏర్పాటు, శిథిల భవనాల మరమ్మతులు వంటి పనులు చేసుకోవడానికి అవకాశం ఉండేది. ఈ విషయమై జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ మాట్లాడుతూ.. 'ప్రత్యేక అధికారి పాలన గత నెల 8వ తేదీతో ముగిసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా కో-ఆపరేటివ్ అధికారులకు నివేదిక పంపిస్తా' అని తెలిపారు.

టీడీపీ ప్రచార రథాలను ప్రారంభించిన అదితి గజపతిరాజు


ప్రచార వాహనాలపై అదితి, అవనాపు విజయ్

విజయనగరం రూరల్, మార్చి 13: తెలుగుదేశం పార్టీ ప్రచార రథాలను టీడీ పీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు గురువారం పార్టీ కార్యాల యంలో టీడీపీ యువజన విభాగం నాయకుడు అవనాపు విజయ్, టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, పిళ్లా విజయ్‌కుమార్, కర్రోతు నర్సింగరావు, గంటా రవితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచార వాహనాలు తిరుగుతాయన్నారు. ముఖ్యంగా ఓటర్లను కలిసే సందర్భంలో ఈ వాహనాలు ద్వారా ప్రజలకు సమాచారం అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

టీడీపీ-జనసేన రోడ్ షో విజయవంతం

● కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్

విజయనగరం రూరల్, మార్చి 13: టీడీపీ-జనసేన-బీజేపీ సంయుక్త నిర్వహణలో ఈ నెల 12న 20, 21, 22, 23, 24 డివిజన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షో విజయవంతం అయ్యిందని టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, అవనాపు భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల ప్రస్తుత ప్రభుత్వ విధానాలను ఈ రోడ్డు షో ద్వారా ప్రజలకు తెలియజేశామని, అదే విధంగా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అదితి గజపతిరాజుని గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. ఈ రోడ్డుషోని విజయవంతం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ శ్రేణులకు, నగరంలోని 20, 21, 22, 23, 24 డివిజన్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

రాజాం: బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నమని విద్యుత్ శాఖ డీఈ జి సురేష్‌కుమార్, ఏడీ సీహెచ్ మాధవరావు, ఏఈ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బొద్దాం , మారేడిబాక, పెనుబాక, సోపేరు, ఎం జోగివలస, గారాజు చీపురుపల్లి, కొత్తవలస కొఠారిపురం, తదితర గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు

రెండు పూటలా పనిచేస్తేనే పూర్తి వేతనం

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండు పూటలూ కొలతల మేరకు పనిచేయాలని ఉపాధి ఏపీవో హరనాథ్ సూచించారు. మండలంలో పారంపేటలో తమ్మినాయుడు చెరువులో బుధవారం జరిగిన ఉపాధి పనిని ఏపీవో తనిఖీ చేశారు. వేతనం గిట్టుబాటు విషయం వేతనదారులు ప్రస్తావన తేగా రెండుపూటలూ పనిచేస్తే రూ. 272లు గిట్టుబాటు అవుతుందన్నారు. టీఏ పార్థసారథి, ఎఫ్ఏ సంగంనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

రామభద్రపురం: పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించి విద్యాభివృద్ధికి సహకరించాలని స్టేట్ రిసోర్సుపర్సన్ కొల్లి ఈశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఎంఈవో తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల సామాజిక తనిఖీ అంశంపై ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లిఈశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర పాఠశాల మూల్యాంకన విధానం, సామాజిక తనిఖీ, పర్యావరణ, సామాజిక వ్యవస్థల విధానాల అమలు వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమాజిక తనిఖీ ఈ నెల 15 నాటికి శతశాతం పూర్తిచేయాలని తెలిపారు. ఈ శిక్షణలో ఎంఈవో-2 పెంటయ్య, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు 745 మంది హాజరు

జామి: మండలంలోని భీమసింగి బాలాజీ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి కల్పనలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 745 మంది యువత హాజరయ్యారు. 22 బహుళజాతి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 391 మంది మొదటి విడతలో 37మంది రెండో విడతలో ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్, కాలేజీ డైరక్టర్ కె వెంకటరావు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోషి కుమారి భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు కాపుగంటి వాసు, చెక్కకిరణ్‌కుమార్, బోజంకి గోవింద, మజ్జి గంగరాజు తదితరులు ఉన్నారు.

ప్రజలకు అండగా నిలుస్తాం

శృంగవరపుకోట రూరల్: మండలంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా నిలుస్తామని ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు అన్నారు. బుధవారం మండలంలోని తిమిడి గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన పూజల్లో వారు పాల్గొన్నారు. సర్పంచ్ ఒబ్బిన త్రినాథమ్మ, ఎస్.కోట మేజర్‌పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమారి, గ్రామ యువనేత సతీష్, వీరనారాయణం గోవిందరావు, వసి వెంకటరావు, చామాలపల్లి బుజ్జీ గ్రామ వార్డు మెంబర్లు, పెద్దలు వున్నారు.

మహిళకు ఆర్థికసాయం

బొబ్బిలి: పట్టణపరిధిలోని పాత బొబ్బిలి గ్రామానికి చెందిన డొంక తవుడు అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆమెకు యువ సంకల్ప అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గొర్లె చిన్నారావు ఆధ్వర్యంలో యూత్ ప్రతినిధులు బాధిత మహిళకు 9,200 రూపాయల నిత్యావసర సరుకులను, నగదును అందజేశారు. డాక్టర్ చోడిగంజి రవి తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికులకు ప్రత్యేక చట్టం చేయాలి

రాజాం/రూరల్: గృహ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని, వారి అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం రూపొందించాలని విలియం మేయర్ సొసైటీ డైరక్టర్ సిస్టర్ హెర్మా హేల్డా కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇక్కడి డొమస్టిక్ వర్కర్స్ కార్యాలయం ప్రాంగణంలో గృహకార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజాం పట్టణ, పరిసర ప్రాంతాల్లో సుమారు 1000 మంది గృహ కార్మికులకు ఎలాంటి పథకాలు అందడం లేదని ఆరోపించారు.

ఈ విధ్వంస పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి

● మాజీ మంత్రి కోండ్రు మురళి


పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం, మార్చి 13: తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి, చంద్రబాబునాయుడిని సీఎంగా చేస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధ వారం పురపాలక సంఘం పరిధిలోని వస్త్రపురికాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆయనకు మంగళ హారతులు ఇచ్చి, పూల వర్షం కురిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశంతోనే రాష్ట్రాన్ని నాశనం చేసుకున్నామని, ఈ విధ్వంస పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్ కుమార్, టంకాల కన్నంనాయుడు, దుప్పల పూడి శ్రీనివాసరావు, కోండ్రు జగదీష్, వంగా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

రాజాం మండలం వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీని వీడి అంతకాపల్లి గ్రామానికి చెందిన 150 కుటుంబాలు, బొద్దాం గ్రామానికి చెందిన 80 కుటుంబాలు టీడీపీలో చేరాయి. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వారికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని, ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని, వెంటనే ఈ సైకో జగన్‌ను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గురవాన నారాయణ రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, నాగళ్ల అప్పలనాయుడు, పొన్నాడ భీమేశ్వర రావు, బట్న సూర్యనారాయణ, మాడుగుల జయరాం, మద్దు హరి తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చందక రాము, చందక అప్పారావు, పొగిరి రాము, పోతురాజు రాము, గార అచ్యుతకుమార్, ఆబోతుల సూర్యనారాయణ, మోహన్‌రావు, తిరుపతి, రాము, మంగటి చిన్నారావు తదితరులు ఉన్నారు.

రేగిడి: రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని రాజాం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలో అంబాడ వెంకటాపురంలో బుధవారం సాయంత్రం మాజీ మంత్రి కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేసి, డబ్బుతో ఓట్లుకొని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రకటించిన సుపర్‌సిక్స్ పథకాలను కోండ్రు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోండ్రును భారీ ర్యాలీగా మహిళలు స్వాగతం పలికి విజయ తిలకంతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో రేగిడి మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌బాబు, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, గోగులు తమ్మినాయుడు, గేదల బాలమురళీధర్, మంతిన ఉషారాణి, రాజాం నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయండి

● విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు


మాట్లాడుతున్న అదితి

విజయనగరం రూరల్, మార్చి 13: టీడీపీ రాష్ట్రశాఖ ఎన్నికల నేపథ్యంలో పార్టీ పరంగా పలు కార్యక్రమాలు ఇచ్చిందని, ఆయా కార్యక్రమాలను వేగవంతంగా గ్రామస్థాయి, డివిజన్ స్థాయి నాయకులు పూర్తి చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో డివిజన్, గ్రామ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ', అదే విధంగా శంఖారావం, ద్వాక్రా మహిళల సమావేశం, జయహో బీసీ, జయహో ఎస్సీ, ఓటర్ల జాబితా వెరిఫికేషన్, ఓటర్ల జాబితాలో చేర్పులు, ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ ఇలా అన్నింటిపైనా కూడా పార్టీ శ్రేణులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయమే లక్ష్యంగా ముందుకు దూసుకువెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ-జనసేన-బీజేపీ విజయం సాధించడం చారిత్రాత్మక అవసరమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది మురళీనా యుడు, పిళ్లా విజయ్‌కుమార్, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం నగదు జమ చేయాలి


డీటీకి వినతిపత్రమిస్తున్న టీడీపీ నాయకులు

తెర్లాం, మార్చి 13: రైతుల ధాన్యం నగదును అందజేయాలని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం డీటీ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు రావాల్సిన బిల్లులు ఇంతవరకూ మండలంలోని రైతులెవ్వరికీ జమ కాలేదని వారు తెలిపారు. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, నర్సుపల్లి వెంకటేశ్వరరావు, కరణం రమేష్‌నాయుడు, బోడెల సింహాచలం, మరపు శంకరరావు, బోరాడ భాస్కరరావు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవాలకు పందిరిరాట


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గీత, గురాన అయ్యలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 13: ఏటా ఉగాది ముందు నూకాలమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. నూకాలమ్మ తల్లి ఉత్సవాలకు అంకురార్పణ నేపథ్యంలో ఈ ఏడాది ఉత్సవాలకు గాను బుధవారం ఆలయ ఆవరణలో పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహకులు గురాన అయ్యలు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఈ కార్యక్రమానికి హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొల్ల రచనలతో వాడుక భాషకు వన్నె


మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 13: తెలుగు కవయిత్రిగా రచనలతో వాడుక భాషకు వన్నెతెచ్చిన కవయిత్రి మొల్లమాంబ అని జిల్లా అదనపు ఎస్పీ ఆస్మాఫరహీన్ కొనియాడారు. మొల్లమాంబ జయంతి వేడుకలు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాంస్కృత భాషలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మహిళగా మొల్లమాంబ ఘనత వహించారన్నారు. ఏఆర్ డీఎస్పీ యానివర్స్, సీఐ మురళీ, ఆర్ఐ శ్రీనివాసరావు, డీపీవో పర్యవేక్షకులు ప్రభాకరరావు, గణేష్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకు వందనం


విద్యార్థులను దీవిస్తున్న తల్లులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ యువీకే.పాత్రో ఆధ్వర్యంలో విద్యార్థులంతా వారి తల్లులకు కాలు కడిగి పాదాభివందనం చేశారు. ముందుగా వినాయక, సరస్వతీ పూజలు నిర్వహించారు. రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించాలని విద్యార్థులను తల్లులు దీవించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవ సమావేశం

● నాతవలస నుంచి బైక్ ర్యాలీ

విజయనగరం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనసేన పార్టీ ఈ సారి తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం డెంకాడ మండల కేంద్రంలో భారీ బహిరంగ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సాయంత్రం 4గంటలకు ప్రధాన రోడ్డులో నిర్వహించనున్న ఈ భారీ సభకు ముందు జాతీయ రహదారిపై నాతవలస కూడలి నుంచి డెంకాడ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీగా డెంకాడ మండల కేంద్రానికి చేరుకుని సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశానికి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, నాయకులు, వీర మహిళలు హాజరు కానున్నారని నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం నాగ మాధవి ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తవలసలో..

శృంగవరపుకోట: కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో గురువారం జనసేన ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప మందిర వార్షికోత్సవం


పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న పీఠాధిపతి


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

రాజాం రూరల్: పట్టణంలోని శాస్తా సమాజం, విశ్వనాథ గురునిలయంలో 12వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాస్తా సమాజం పీఠాధిపతి ఉమాపతి శేష గురుస్వామి సారథ్యంలో వేదపండితులు రాజుస్వామి, చంటిస్వామి తదితరులు అయ్యప్పస్వామికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానాన్ని తూర్పు కాపులకు కేటాయించాలి


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 13: విజయనగరం జిల్లాలో తూర్పుకాపులు అధికంగా ఉన్నారని, ఎంపీ స్థానాన్ని తూర్పుకాపులకే కేటా యించాలని తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం కామాక్షినగర్ లోని తూర్పు కాపు సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ తూర్పుకాపులు అణచివేతకు గురవుతున్నారని, వెనుకబడిన జాతికి చెందిన తూర్పుకాపులను ఎప్పుడూ బడుగు జాతులుగానే చూస్తున్నారు తప్ప, పాలన అధికారం ఇచ్చేందు కు పార్టీలు ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీలు తూర్పు కాపుల ప్రాధాన్యం గుర్తించి, ఎంపీ స్థానాన్ని తూర్పుకాపులకు కేటాయించాలని, కేటాయించని పక్షంలో తూర్పుకాపుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించా రు. సంఘ ప్రతినిధులు అంబళ్ల అప్పలనాయుడు, చంద్రమౌళి, వెంకట రమణ, రమణమూర్తి, సాయి, మోహన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే ఇప్పించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జగన్మోహన్‌రావు

విజయనగరం దాసన్నపేట, మార్చి 13: నగరపాలక సంస్థలో పని చేస్తున్న ముషిడిపల్లి, రామతీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంపు హౌస్ కార్మికులకు బకాయిలు వెంటనే ఇప్పించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు కోరారు. బుధవారం నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనా యుడిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మా ట్లాడుతూ, నాలుగు నెలల జీతాల బకాయిలు ఉన్నాయని, అమృత కార్మికులకు మార్చి, ఏప్రిల్-2023కి సంబంధించిన బిల్లు కూడా పెట్టలేదన్నారు. వీరిని ఆప్కాస్‌లో చేర్చుకోకపోవడం వల్ల ఒక్కొక్క కార్మికుడూ నెలకు 4 వేల నుంచి 6 వేల చొప్పున నాలుగేళ్లలో 2 లక్షల 88 వేలు నష్టపోయారన్నారు. తక్షణమే జీతా లు చెల్లించాలని, చెల్లించేంత వరకూ దశల వారీగా నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాంబాబు, నారాయణరావు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మహా కార్యక్రమం


రావువారివీధి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పీవో విజయలక్ష్మి

బొబ్బిలి, మార్చి 13: బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావువారివీధి, మండలంలోని కృష్ణాపురం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్‌మహా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా కేంద్రాలను పీవో విజయలక్ష్మి సందర్శించి గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొప్పలవెలమలకు పెద్దపీట వేయాలి


సంఘీభావం తెలుపుతున్న కొప్పలవెలమ సంఘనాయకులు

బొబ్బిలి, మార్చి 13: జనాభా దామాషా ప్రకారం విజయనగరం, అనకాపల్లి లోక్‌సభ స్థానాల్లో పోటీచేసేందుకు అన్ని రాజకీయపార్టీలు కొప్పలవెలమలకు అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో బుధవారం సంఘం నాయకుడు బి. తిరుపతినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొప్పలవెలమ జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాలను రిజర్వు చేసి అన్యాయం చేశారని, దీనిలో ఎవరి హస్తం ఉందో అని ప్రశ్నించారు. 30 లక్షల జనాభా ఉన్న కొప్పలవెలమలకు రాజకీయపార్టీలు సీట్లు ఇచ్చేందుకు వెనుకంజ వేయడం బాధాకరమన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కొప్పలవెలమలకు కేటాయించి సమతుల్యత పాటించాలని డిమాండ్ చేశారు. దీనిపై గురువారం బొబ్బిలిలో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కొప్పలవెలమ సంఘం నాయకులు మరిశర్ల అన్నంనాయుడు, పెద్దింటి ముకుందరావు, చుక్క భాస్కరరావు, డొగ్గ దేముడు, రాష్ట్ర సంఘం సలహాదారు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికీ మేలు


టీడీపీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్‌లను ప్రదర్శిస్తున్న కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, మార్చి 13: టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం స్థానిక శ్రీనివాస కాలనీలో శంఖారావం, సూపర్ సిక్స్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయ కులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరిగారు. సూపర్ సిక్స్ క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. వాటిని ప్రదర్శించారు. ఈ పథకాలను అందరికీ వివరించారు. వైస్‌ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, గన్ను బంగారమ్మ తదితరులున్నారు.

కొనసాగుతున్న టీడీపీ జయహో 'ఎస్సీ'


హామీలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 13: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ టీడీపీ ఎస్సీ సెల్ విభాగం 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. బుధవారం 11 వ డివిజన్ పరిధిలోని కాటవీధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాటవీధి లోని దళిత కుటుంబాలు ఇంటింటికీ వెళ్లి టీడీపీ హయాంలో ఎస్సీల సంక్షేమం కోసం కృషి, ప్రస్తుత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అనుసరించిన ఎస్సీ వ్యతిరేక విధానాలను టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కండువా ప్రకాష్ వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

అధినేత నిర్ణయానికి కట్టుబడి పనిచేద్దాం

● జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి

రాజాం రూరల్, మార్చి 13: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయానికి కట్టుబడి పనిచేద్దామని, తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ విజయానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొగిరి సురేష్ బాబు జనసైనికులకు స్పష్టం చేశారు. స్థానిక వెంకటదుర్గ కల్యాణమండపంలో బుధవారం రాత్రి ఏర్పాటుచేసిన జనసేన ఆత్మీయ సదస్సులో ఆయన పార్టీశ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పొత్తు ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సురేష్‌బాబు గుర్తు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి, తెదేపా రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో అరాచకం పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో తెదేపా-జనసేన అధికారంలోకి వచ్చాక రాజాంలో భూగర్భ డ్రైనేజీ, రింగురోడ్డు నిర్మాణం, పీజీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన, తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జామిలో టీడీపీ మెగా వైద్యశిబిరం

జామి, మార్చి 13: జామిలో విశాఖ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు, గీతం సంస్థల చైర్మన్ శ్రీభరత్ సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ శిబిరంలో రోగులకు ఎన్‌టీఆర్ సేవాసమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్ట్‌కు చెందిన ప్రత్యేక వైద్యనిపుణులు రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం లలితకుమారి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్య, వైద్యంకు పూర్తి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ శిబిరం ఏర్పాటుపై మండల వాసులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, వర్రి రమణ, మాకిరెడ్డి శ్రీలక్ష్మి తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలకు స్లిప్‌లు

● సమాచారం అందుకుని, చేరుకున్న పోలీసులు


చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

రాజాం, మార్చి 13: సంతకవిటి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగు తుందన్న వార్త కలకలం రేపింది. ఇక్కడ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ లెక్చరర్లు స్లిప్పులు తయారు చేసి సప్లయ్ చేస్తున్న విషయం వైరల్ కావడంతో ఎస్ఐ షేక్ శంకర్ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ట్రైనింగ్ డీఎస్పీ మహేంద్ర, సీఐ శ్రీనివాస్, తదితరులు స్లిప్పులు తయారు చేస్తున్న ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై జిల్లా ఎస్పీ దీపికకు సమాచారం అందించారు. వెంటనే పోలీసు సిబ్బంది విద్యార్థుల నుంచి మాస్‌కాపీయింగ్ పై ఆరా తీశారు. ఈ విషయం ఇంటర్ బోర్డు పరీక్షల కన్వీనరు వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. స్లిప్‌లు తయారీకి సంబంధించి కొంత సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. దీంతో ఇంటర్ పరీక్షల నిర్వహణకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ చీఫ్, ఇన్విజిలేటర్లు, సిబ్బందిని విధులు నుంచి తప్పించి వేరే సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది. అయితే స్లిప్‌లు తయారీకి బాధ్యులైన కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ లెక్చరర్లను తప్పించకుండా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారని సమాచారం. ఈ విషయంపై ఆర్ఐవో ఆదినారాయణ వద్ద ప్రస్తావించగా సంతకవిటిలో మాస్ కాపీయింగ్ జరుగుతున్న విషయంపై పూర్తి సమాచారం అందిందని, అందుకు చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్టుమెంటల్ అధికారిని, ఇన్విజిలేటర్లును, సిబ్బందిని తప్పించి వేరే వారిని నియమించామని, దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కంపెనీకి అనుకూలం.. కాలుష్యానికి వ్యతిరేకం


మాట్లాడుతున్న డీఆర్‌వో అనిత

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 13: మండలంలోని కంటకాపల్లి, చిన్నపాలెం గ్రామాల్లో సుమారు 73 ఎకరాల్లో 685 కోట్లతో నిర్మించబోతున్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారానికి ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభించింది. బుధవారం దన్నినపేట వద్ద డీఆర్వో ఎస్‌డి.అనిత ఆధ్వర్యంలో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో కాలుష్యానికి వ్యతిరేకంగా గళం వినిపించారు. శారద, జిందాల్ స్టీల్ ఎక్ఛేంజ్ ఇండియా, మహామాయా వంటి కంపెనీలు వదులుతున్న కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పశువులు, పక్షులు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి మూగ జీవాలకు భద్రతలేని స్థితి ఏర్పడిందని స్థానిక నేతలు ఎల్.సూర్యనారాయణ, సత్యనారాయణ, రమణ తదితరులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకం కాదని, కానీ పొల్యూషన్ లేకుండా చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. పొల్యూషన్‌కి లోబడి కంపెనీని ఏర్పాటు చేస్తామని యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు ఇంజినీర్ బీటీ.సరిత, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులను మెరుగుపరచాలి


పి.ఏ.ఎల్ ల్యాబ్ పరీక్షను తనిఖీచేస్తున్న దృశ్యం

రేగిడి: పాఠశాలలో వెనకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని సుశిక్షితులుగా తయారుచేయటమే పర్సన లైజ్ అడాప్ట్ ల్యాబ్ (పిఏఎల్-ల్యాబ్) ల క్ష్యం అని విజయవాడకు చెందిన జె- పాల్ టీం ఫీల్డ్ ఆఫీషర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో కాగితాపల్లి హైస్కూల్లో ఏర్పాటుచేసిన పర్సనలైజ్ అడాప్ట్ ల్యాబ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఎంఈవో ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

బాడంగి, మార్చి 13: మండల పరిధిలోని రామచంద్రాపురం పోలింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ రాజారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం, ప్రహరీలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు వంటివాటిని పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జియ్యమ్మవలస: మండలంలో చినమేరంగి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు, ఏడో తరగతులతో పాటు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మరడాన శ్రీదేవి తెలిపారు. బుధవారం చినమేరంగిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో రెండు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. ధ్రువపత్రాలను కేజీబీవీకి తీసుకువచ్చినా అక్కడే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

●**మక్కువ:** మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్‌ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రత్యేకాధికారి జి.నాగదుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'డబ్బు లేక వ్యాధులతో బాధ పడకూడదు'

సాలూరు రూరల్: డబ్బులేక పేదలెవరు వ్యాధులతో బాధకూడదనేది తన లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. బుధవారం సాలూరులో పలువురికి బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

20న అభయ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

సాలూరు రూరల్: మరిపిల్లిలో ఈనెల 20న అభయ ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు మరిపిల్లి హైందవ సైన్యం సంస్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 18న ఉత్సవమూర్తికి తిరువీధి,జలాభిషేకం, 19న సీతమ్మకు కుంకుమపూజ, క్షీర,ధాన్యాధి వాసం నిర్వహిస్తామని తెలిపింది.

సచివాలయ భవనాల పరిశీలన

సాలూరు రూరల్: మండలంలోని సారిక, మావుడి,మామిడిపల్లి గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను క్వాలిటీ కంట్రోల్ బృందం బుధవారం పరిశీలించింది.కార్యక్రమంలో క్యూసీ ఏఈ లక్ష్మణరావు, ఏఈ ఫరూక్ పాల్గొన్నారు.

వలసబల్లేరులో వైద్యశిబిరం

కురుపాం రూరల్:వలసబల్లేరు గ్రామంలో బుధవారం నీలకంఠాపురం పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.ఈసందర్భంగా 350 మంది గిరిజనులకు కురుపాం, మొండెంఖల్, నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యులు బి.ప్రజ్ఞ, సాయిప్రసాద్, సుకృత, సంధ్య, అభినవ కుమార్, విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది తనిఖీచేశారు.

బెలగాం: పార్వతీపురంలోని నిరాశ్రయుల వసతిగృహంలో ఐఆర్‌పీడబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్లు యాళ్ల వివేక్, శ్రీకాంత్, శిరీష వైద్య పరీక్షలు నిర్వహించారు.100 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు ఐఆర్‌పీడబ్ల్యూ సంస్థ ప్రతినిధి ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, రెడ్ క్రాస్ సొసైటీ, మెప్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురికి రూ.ఐదు వేలు చొప్పున అందజేయనున్నట్లు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సర్పంచ్ మరడ వెంకటరత్నంకు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పార్వతీపురంటౌన్/బెలగాం:పట్టణంలోని శ్రీలేఖ కూడలి వద్దగల ఓ షాపు బయట గుర్తుతెలియని మృతదేహం లభ్యమయ్యింది. ఇక్కడ ఓ మృతదేహం పడిఉన్నట్లు బుధవారం పట్టణపోలీసులకు స్థానికులు సమాచారాన్ని అందించారు. దీంతో వెంటనే సీఐ కృష్ణారావుతో పాటు పోలీసులు చేరుకొని మృతిచెందిన వ్యక్తి కోసం ఆరాతీశారు. ఎవరూ సమాచారం ఇవ్వకపోవడంతో జిల్లా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచారు. మృతుడికి సంబంధించిన ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసుకు సమాచారాన్ని అందించాలని సీఐ కోరారు.

ఎంఎల్ఐ కార్యదర్శిగా శ్రీనివాసులు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎంఎల్ఐ) కార్యదర్శి డాక్టర్ కడియం శ్రీనివాసులును రాష్ట్ర కమిటీ సభ్యులు ఆమోదం మేరకు నియమించారు. ఈ మేరకు రాష్ట్ర నాయకులు ప్రసాద్‌బాబు ఉత్తర్వులు పంపించారని బుధవారం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: నాగబాబు

పాలకొండ: తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు తెలిపారు.అన్నవరానికి చెందిన గొట్టాపు దుర్గాప్రసాద్ రైలు ఢీకొని ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. దీంతో జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న దుర్గా ప్రసాద్ తల్లి భారతికి రూ.ఐదు లక్షలు నాగబాబు మంగళగిరి జనసేన పార్టీ కేంద్రం కార్యాలయంలో బుధవారం అందించారు.

లక్ష్యాలు చేరుకోకుంటే చర్యలు: ఏపీడీ

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలుచేరుకోకుంటే చర్యలు తప్పవని ఆ పథకం ఏపీడీ గుంట్రెడ్డి శ్రీహరినాయుడు తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో ఉపాధి సిబ్బందితోసమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు కె.నిర్మల, భూలక్ష్మీ, ఉమామహేశ్వరి, ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

టెంట్లు ఏర్పాటు చేయండి: ఏపీవో

వీరఘట్టం: ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని ఏపీవో జి.సత్యంనాయుడు తెలిపారు.బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. పనిప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో వంద రోజుల పనిదినాలు 1,101 కుటుంబాలు మాత్రమే పూర్తయ్యాయని, నెలాఖరులోగా 1,500 కుటుంబాలకు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోషకాహారంపై శ్రద్ధ చూపాలి: సీడీపీవో



పోషకాహార ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది,గిరిజనులు

సాలూరు రూరల్:గిరిజనులు పోషకాహంపై శ్రద్ధచూపాలని సాలూరు ఐసీడీఎస్ సీడీపీవో బి.సత్యవతి పిలుపునిచ్చారు. బుధవారం పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా కొఠియా గ్రూప్‌లోని పట్టుచెన్నారులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మిఆధ్వర్యంలో అవగాహనకార్యక్రమం జరిగింది.ఈసందర్భంగా పోషకాహారంపై అవగాహనర్యాలీచేశారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



సీడీపీవో అనంతలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాచిపెంట: సమ్మె కాలం వేతన బకాయిలు చెల్లించాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.దాలమ్మ, కె.పార్వతి డిమాండ్‌చేశారు. బుధవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సీడీపీవో బి.అనంతలక్ష్మికి అంగన్‌వాడీ కార్యకర్తలు అందజేశారు. 42 రోజుల సమ్మె కాలపు వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు కూడా పూర్తిగా చెల్లించాలన్నారు. ఐసీడీఎస్ బలోపేతం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా కృషి చేయాలని కోరారు.

గుమ్మలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కురుపాం రూరల్: గుమ్మలో ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కురుపాం పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ప్రజల్లో అభద్రతా భావాన్ని రూపుమాపేందుకు, ధైర్యం పెంచేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు.

వైసీపీని తరిమికొట్టాలి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



పాచిపెంట: విశ్వనాథపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న సంధ్యారాణి

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

వైసీపీకి బుద్ధిచెప్పాలి: సంధ్యారాణి

పాచిపెంట: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని విశ్వనాధపురంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనను ప్రజలు గమనించారని, విసుగు చెందిపోయారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులతో వైసీపీ చిత్తవ్వడం ఖాయమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ఆర్పీ భంజ్‌దేవ్, ముఖి సూర్యనారాయణ, పిన్నింటి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

మక్కువ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం ఖాయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని శంబరలో బాబుషూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో 150 యాదవ కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు మావడి ప్రసాదరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గేదెల రిషివర్ధన్, నైదాన గణ, నైదాన సూర్య, ఆవాల వెంకటేష్, మద్ది రాము, పుర్రు నారాయణరావు, పాల్గొన్నారు.

జగన్ పాలనపై అసంతృప్తి: శత్రుచర్ల

గరుగుబిల్లి: సీఎం జగన్ పాలనపై ప్రజలు తీవ్రస్థాయిలో అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో శంఖారావంతోపాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి సూపర్ సిక్స్ పతకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలన్నారు. టీడీపీ ప్రతినిధి గొట్టాపు లక్ష్మంనాయుడు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గొట్టాపు త్రినాధస్వామితో పాటు పలువురికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ఎ.రాంబాబు, జి.లక్ష్మంనాయుడు, పి.పూర్ణచంద్రరావు, ఎ.గంగాధర్‌నాయుడు, వెంపటాపు భారతి, వి.దివాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: ద్వారపురెడ్డి

రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అరకు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. చిలకాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. జగన్‌రెడ్డి పర్యటనలకు వస్తే నరకం చూస్తున్నారన్నారు. పాముల పుష్పశ్రీవాణి పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. కేవలం రహదారులకు కొబ్బరికాయలు కొట్టేందుకే పరిమితమయ్యారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, పార్టీ ప్రతినిధులు బి.నారాయణస్వామి, కె.బలరాంనాయుడు, ఎ.నారాయణరావు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: మండలంలోని లచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, పార్వతీపురం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జి.చంద్రమౌళి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.



గరుగుబిల్లి: మాట్లాడుతున్న సత్యనారాయణ



కొత్తపల్లిలో టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న శత్రుచర్ల, జగదీశ్వరి



పార్వతీపురం రూరల్: బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట సభకు పరిశీలకుడిగా జగదీష్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: చిలకలూరిపేటలో ఈనెల 17న జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ బిజెపి ఉమ్మడి సభకు తనను పరిశీలకుడిగా నియమించారని టీడీపీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ తెలిపారు. పెనములూరి నియోజవర్గం నుంచి జనసమీకరణకు బాధ్యతలను అప్పగించారని చెప్పారు. బుధవారం పార్వతీపురంలో ఆయన మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి విలేక రుల తో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు 160 స్థానాల్లో విజయం సాధిస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు దృష్ట్యా బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా వెంకటరావు, జి.రవికుమార్, ఎం.కార్తీక్‌ప్రదీప్, టి.వెంకటరమణ, డి.మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్, చిరంజీవులు

భావితరాలకు మొల్ల స్ఫూర్తి: డీఆర్వో



మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: కవయిత్రి ఆతుకూరు మొల్లమాంబ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. బుధవారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కవయిత్రి ఆతుకూరు మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవనాయుడు, జిల్లా శాలివాహన సంఘ గౌరవాధ్యక్షుడు కొత్తూరు శంకరరావు, మొల్ల చి త్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా శాలివాహన సంఘ గౌరవాధ్యక్షుడు కొత్తూరు శంకరరావు, బీసీ సంక్షేమ అధికారి కృష్ణ, శాలివాహన సంఘం జిల్లా కమిటీ జనరల్ సె క్రటరీ ఉరిటి యాదవ్, ప్రతినిధులు ఈశ్వరరావు, రమణ, దారబాబు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

కురుపాం రూరల్: గతఏడాది నుంచి చేసిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించాలని జిల్లా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం దురుబిల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో జీడి, మామిడి, కందులు, చింతపండు పంటలు పండక, ఉపాధి హామీ వేతనాలు రాక గిరిజనులు అవస్థలుపడుతున్నారని తెలిపారు.

17 నుంచి కనకమహాలక్ష్మి జాతర

చీపురుపల్లి: చీపురుపల్లిలో ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటుచేశారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం ఆలయానికి సమీపంలోని మైదానంలో వేదిక నిర్మిస్తున్నారు. మూడు రోడ్ల కూడలి నుంచి అమ్మవారి ఆలయం, రాజాం, విజయనగరం రోడ్లలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గణపతిరావు



రైతులకు సామగ్రిని అందజేస్తున్న అధికారులు

గరుగుబిల్లి: వేసవిలో పాడి పశువులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.గణపతిరావు కోరారు. బుధవారం మండలంలోని సంతోషపురం, సుంకి పంచాయతీల్లో ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా పశు వైద్య శిబిరాలు నిర్వహించి, రైతులకు పలు రకాల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన కల్పిస్తే తగిన మార్పు వస్తుందన్నారు. అనంతరం పాడి పశువులు, లేగ దూడలకు ఏలిక పాముల నివారణ మందులు అందించారు. చూడి పరీక్షలు నిర్వహించారు. పాల ఉత్పత్తులు పెరిగేందుకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్, పశు వైద్యాధికారులు ఎస్.సురేష్‌కుమార్, ఎం.శ్రీరాములునాయుడు, సర్పంచ్ ఎ.తవిటినాయుడు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి.హరిరామకుమార్, ఆర్.రాజ్యలక్ష్మి, బీవీజీ ప్రసాద్, గీతాంజలి, ఎ.రామారావు పాల్గొన్నారు.

కొఠియాలో ఓటింగ్ శాతం పెరగాలి

సాలూరు రూరల్: ఏవోబీలో కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగాలని సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) జిల్లా నోడల్ అధికారి ఎ.రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొఠియా గ్రూప్‌లోని పట్టుచెన్నారులో ఓటర్ల చైతన్య కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. పట్టుచెన్నారులో మానవహారం,ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది సత్యవతి,విజయలక్ష్మి,లక్ష్మి పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతికి చర్యలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు అన్నదొర తెలిపారు. బుధవారం సీతంపేటలో విలేకరులతో మాట్లాడుతూ సీతంపేటలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో నిర్వహించే కార్య క్రమంలో గురువారం స్కూల్ అసిస్టెంట్లను పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తామని పేర్కొన్నారు. మరో ఎనిమిది మంది ఒప్పంద ఉపాధ్యాయులకు రెగ్యులరైజేషన్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటికే 29 మంది రెగ్యులరేషన్ ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్య క్రమంలో సంక్షేమశాఖ పర్యవేక్షకులు దేశ్‌హరిగోపాల్, మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

సీతంపేట: స్థానిక వైటీసీ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల సమావేశం తూతూమంత్రంగా జరిగింది. ఎన్నికల కోడ్ వస్తుందన్న నేపథ్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో గీతాంజలి ప్రకటించారు. అయితే సమావేశాన్ని మధ్యాహ్నం నిర్వహించిన గంటలోనే ముగించడంవిశేషం.కీలకశాఖలకు చెందిన అంశాలు సమావేశంలో ప్రస్తావించకుండానే సమావేశం ముగించడంతో కొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డి కొండపల్లి సత్యం పాల్గొన్నారు.

'సమస్యలపై అవగాహన ఉన్నవారికే ఆదరిస్తాం'



సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్స్ ఈయూ నాయకులు

పాలకొండ:పురపాలకసంఘాలు, కార్పొరేషన్లలో కార్మికసమస్యలపై అవగాహన ఉన్నవారిని, పోరాటాల అండగా ఉన్నవారిని వచ్చే ఎన్నికల్లో కార్మిక కుటుంబాలు ఆదరిస్తాయని, రాజకీయ పార్టీలు వారి మ్యానిఫెస్టోలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ పేర్కొంది. బుధవారం పాలకొండలో పార్వతీపురం మన్యం జిల్లా మున్సిపల్ కార్మికులు జనరల్ బాడీ సమావేశం యూనియన్ నాయకుడు పడాల భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్‌వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వై నాయుడు, సీఐటీయూజిల్లా అధ్యక్షుడు డి.రమణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 16రోజుల సమ్మె అనంతరం ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేయడంలో పురపాలక సంఘా లు, కార్పొరేషన్‌లో పాలకవర్గాలు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు వేణుసంజీవి, సురేష్, శ్రీదేవి, విమల పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

పాలకొండ: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యారులకు అవగాహన ఉండాలని అగ్నిమాపకశాఖాధికారి సర్వేశ్వరరావు సూచించారు.బుధవారం నగర పంచాయతీలోని హడ్కోకాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగేసమయంలో నివారణకు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మీసాల రామకృష్ణ, ఉపాధ్యాయులు కంబాల జయమణి, సుధారాణి, అరుణకుమమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమడ స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించండి

● విశాఖపట్నం రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌కు వినతి



డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

కొమరాడ: గుమడ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లిసాంబమూర్తి, పార్వతీపురం మన్యం జిల్లా కళింగ వైశ్య అధ్యక్షుడు వడ్డి గాంధీ, టీడీపీ నాయకులు బత్తిలి శ్రీనివాసరావు, పండిత్ బాలకృష్ణ పాత్రో, నీరస సీతారాం, ఆర్.సతీష్ కోరారు. ఈ మేరకు బుధవారం గుమడ రైల్వేస్టేషన్ పరిశీలనకువచ్చిన విశాఖ రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గుమడ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని, అంతర్రాష్ట్ర రహదారి నుంచి రైల్వేస్టేషన్ వరకు బీటీ రోడ్డు వేయాలని, రిజర్వేషన్ కౌంటర్ కల్పించాలని, మూడో లైన్‌లో నిలుపుదల చేస్తున్న ఎక్స్‌ప్రెస్ , పాసింజర్ రైళ్లను ఒకటో ఫ్లాట్‌ఫారానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకుంటానని డీఆర్ఎం హామీ ఇచ్చినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పండిత్ రాంజీ పాత్రో తెలిపారు.

డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

● ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కృష్ణమూర్తి

పాలకొండ: పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, డ్రైవర్ బీడీ రావు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి డిమాండ్‌చేశారు. బుధవారం పాలకొండలో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతూ గత ఏడాది సీతంపేట మండలంలోని పులిపుట్టి వద్ద ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మరణించారని, బిడి రావును సస్పెండ్ చేశారన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ తప్పులేదన్నారు.బీడీరావు పదవీ విరమణ ఈనెల 30న ఉందని,ఏకపక్షంలో సస్పెండ్‌చేసి ఆయన కుటుంబసభ్యులను రోడ్డు మీద పడవేయవద్దన్నారు.విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ దామోదర్‌నాయుడు, డిపో అసిస్టెంట్ సెక్రటరీ దుమ్మెద గౌరీశ్వరరావు, డిపో ముఖ్య సలహాదారు ఎల్లు మహంతి రామకృష్ణపా త్రో, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, గ్యారేజ్ ప్రెసిడెంట్ పి.లక్ష్మణరావు, రాజబాబు, జీవీ బాబు, డిపో నాయకులు వెంకటరమణ, కృష్ణారావు పాల్గొన్నారు.



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న భాసూరు కృష్ణమూర్తి